లోక్‌సభ విప్ బృందంలో కోట శ్రీనివాస పూజారి

బెంగళూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో ఉడుపి-చిక్కమగళూరు ఎంపీ కోట శ్రీనివాసపూజారికి కీలకమైన పదవి వరించింది. లోక్‌సభ కార్యకలాపాలు సజావుగా నడిచేందుకు చీఫ్‌విప్‌కు అనుబంధంగా 16 మంది విప్‌ల ను నియమించారు. వీరిలో కోట శ్రీనివాసపూజారికి అవకాశం కల్పించారు. బీజేపీ పార్లమెంటరీ వ్యవహారాలశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బీజేపీ పార్లమెంటరీ బోర్డు కార్యదర్శిగా కొనసాగుతున్న శివశక్తినాథ్‌ను చీఫ్ విప్‌గా ని యమించారు. ఆయన బృందంలో కోట శ్రీనివాసపూజారికి అవకాశం ఇచ్చారు. ఈ మేరకు ఎక్స్ ద్వారా కోట పార్టీ ముఖ్యనేతలకు ధన్యవాదాలు తెలిపారు.



నీట మునిగిన త్రివేణి సంగమం

మునిగిన త్రివేణి సంగమం

కొడగు జిల్లా మడికేరి సమీపంలో త్రివేణి సంగమం సంపూర్ణంగా మునిగిపోయింది. భాగమండలంలోని భగండేశ్వర ఆలయం మెట్లదాకా నీరు చేరింది. నాపోక్లు - మడికేరి రోడ్డుపై నీరు భారీగా ప్రవహిస్తుండడంతో రవాణా నిలిపివేశారు. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు మహారాష్ట్రలో భారీ వర్షాలతో బాగల్కోటె జిల్లాలో ముధోళ - సాంగ్లి రోడ్డుపై రాకపోకలు నిలిపివేశారు. మలప్రభ నది నీటిప్రవాహం పెరగడంతో బాదామి తాలూకా గోవనకొప్ప వద్ద పాత బ్రిడ్జి మునిగిపోయింది. ఇదే ప్రాంతంలోని వందలాది ఎకరాలలో చెరుకు పంట దెబ్బతింది. బెళగావి జిల్లా పరిధిలోని ఏడు నదుల ప్రవాహం పెరగడంతో 43 గ్రామాలలో వరద పోటెత్తుతోంది. గోకాక్, మూడలగి, నిప్పాణి, చిక్కోడి, కాగవాడ, అథణి, హుక్కేరి తాలూకాలలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బాగల్కోటె జిల్లాలో మార్కండేయ, హిరణ్యకేశి, కృష్ణ నదుల ప్రవాహానికి ప్రజలు బయటకొచ్చే పరిస్థితి లేకుండా పోయింది. బాగల్కోటె జిల్లా మిర్జి గ్రామంలో 70 ఇళ్లు పూర్తిగా మునిగిపోయాయి. గోకాక్ తాలూకా మళవంకి గ్రామంలో 500 ఇళ్లలోకి నీరు చేరింది. వీరంతా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. మరో నాలుగురోజులు వర్షాలు ఉంటాయని వాతావరణ పరిశోధనశాఖ హెచ్చరిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలతోపాటు ఈదురుగాలులు ఉంటాయని, శివమొగ్గ, కొడగు, చిక్కమగళూరు, దక్షిణకన్నడ, ఉడుపి జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు.



గోకాక్ తాలూకా మెలవంకి గ్రామం ఇలా...

జలదిగ్బంధం

- కొనసాగుతున్న వరుణుడి బీభత్సం
- ఐదు జిల్లాల్లో రెడ్ అలర్ట్
- బాగల్కోటె, బెళగావి జిల్లాల్లో మునిగిన ఇళ్లు
- చిక్కమగళూరులో విరిగిన కొండచరియలు
- పలు రహదారుల్లో స్తంభించిన రాకపోకలు
- చార్మాడిఘాట్ బంద్
- మునిగిన త్రివేణి సంగమం

బెంగళూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): వరుణుడి బీభత్సం కొనసాగుతోంది. పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఐదు జిల్లాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. చిక్కమగళూరు - మంగళూరు మధ్య ప్రధాన రహదారికి అనుబంధమైన చార్మాడి ఘాట్‌పై కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో రాకపోకలు నిలిపివేశారు. ఇటీవల బెంగళూరు - మంగళూరు జాతీయ రహదారి 75పై శిరాడిఘాట్‌లో కొండచరియలు విరిగిపడిన విషయం తెలిసిందే. దీంతో వాహనదారులు చార్మాడిఘాట్ మీదుగా ప్రయాణించేవారు. ప్రస్తుతం అక్కడా మట్టి కూలుతుండడంతో కొట్టిగెహార, బెళ్తంగడి వద్ద వాహన సంచారం నిలిపివేశారు. దీంతో వందలాది వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయాయి. మరోవైపు హాసన్ జిల్లా సకలేశపుర వద్ద దొడ్డతప్ప వద్ద శిరాడిఘాట్‌లో మట్టి పడింది. ఈ మార్గంలోనూ వాహన సంచారానికి అంతరాయం ఏర్పడింది. జాతీయ రహదారి విస్తరణ పనులు చేస్తున్న కంపెనీపై స్థానికులు మండిపడుతున్నారు. మరోవైపు బెంగళూరు - మంగళూరు మధ్య ఏకైక మార్గంగా ఉండే రైల్వే ట్రాక్‌పై పలు చోట్ల మట్టి పడింది. దీంతో పునరుద్ధరణ పనులు వేగవంతంగా చేస్తున్నారు. ఈ మేరకు మంగళూరు నుంచి బెంగళూరు వెళ్లదలిచినవారు జాతీయ రహదారి దొడ్డతప్ప వద్ద మట్టి పడుతుండడంతో సంచారం నిలిపివేశామని సంపాజె, మడికేరి మీదుగా వెళ్లాలని దక్షిణకన్నడ జిల్లా అధికారి ముల్లై ముగిలన్ ప్రకటించారు. ఈ మేరకు మంగళూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అత్యవసరం ఉంటే మాత్రమే ప్రయాణాలు చేయాలని సూచించారు. వాహనాలు రోడ్డెక్కేముందు ముందస్తు సమాచారం తెలుసుకోవాలన్నారు. మైసూరు జాతీయ రహదారి పుత్తూరు తాలూకా ఒళెమగ్రు గ్రామంలో కుమ్రె వద్ద మంగళవారం మధ్యాహ్నం కొండచరియలు రోడ్డుపై పడ్డాయి. విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిపివేశారు. సంప్య గ్రామీణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కార్యాచరణ చేపట్టారు.

తాత్కాలిక ఏర్పాట్లు..





బెళగావి జిల్లా ముసుగుప్పి గ్రామంలో నీట మునిగిన 500 ఇళ్లు

చిక్కమగళూరులో అప్రమత్తం

కేరళ రాష్ట్రం వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడి భీకరమైన ప్రమాదం చోటుచేసుకోగా పొరుగున ఉండే చిక్కమగళూరు జిల్లా అంతటా అప్రమత్తం చేశారు. వయనాడ్‌కు అనుబంధంగా ఉండే చిక్కమగళూరు జిల్లాలో ముందస్తు చర్యలు తీసుకున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కేజే జార్జ్ జిల్లా అధికారులతో మంగళవారం పరిస్థితిపై సమీక్షించారు. చిక్కమగళూరు జిల్లా అంతటా హెచ్చరికలు జారీ చేయాలన్నారు. చార్మాడిఘాట్‌లో ప్రయాణాలను నిషేధించారు. ఇప్పటికే పలు చోట్ల రోడ్లపై హెచ్చరిక బోర్డులు పెట్టారు. వర్షాకాలంలో చిక్కమగళూరు జిల్లాను సందర్శించేందుకు పెద్దఎత్తున పర్యాటకులు వస్తుంటారు. వారికి ముందస్తు సందేశాలు ఇస్తూ అప్రమత్తం చేశారు.

వయనాడ్‌లో రెండు కుటుంబాలు గల్లంతు

కేరళ రాష్ట్రం వయనాడ్‌లో వరుసగా భూమి కుంచించుకుపోతున్న ప్రమాదంలో మృతుల సంఖ్య పెరుగుతోంది. చూరల్‌మల్‌లో కొండచరియలు విరిగిన ప్రమాదంలో మృతుల సంఖ్య 80 దాటింది. కాగా చామరాజనగర జిల్లాలోని రెండు కుటుంబాలు గల్లంతైనట్టు తెలుస్తోంది. జిల్లాలోని సోమవారపేటకు చెందిన రత్నమ్మ, రాజేంద్ర కనిపించకుండా పోయారు. అర్ధరాత్రి ప్రమాదం జరగడంతో వారి ఆచూకీ తెలియరాలేదు. ఇటీవలే కొంతకాలంగా వారు పనులకోసం వెళ్లారు. వారి బంధువులు ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. ముండక్కైలో కొండచరియలు పడిన ప్రమాదంలో చామరాజనగర జిల్లాకు చెందిన మరో కుటుంబం కూడా ఆనవాళ్లు లేకుండా పోయింది. ఝాన్సీరాణితోపాటు రెండున్నరేళ్ల కుమారుడు నిహాల్ కనిపించలేదు. వీరు గుండ్లుపేటకు చెందినవారు కాగా ముండక్కైలో ఓ టీ ఎస్టేట్‌లో పనిచేస్తున్నారు. వీరు నివసిస్తున్న టీ ఎస్టేట్ ప్రాంతంలోనే కొండచరియలు విరిగిపడ్డాయి. చామరాజనగర జిల్లా అధికారి శిల్పానాగ్ స్పందిస్తూ కర్ణాటకకు చెందినవారు ఎవరైనా ఉన్నారా.. అనే కోణంలో ఆరా తీస్తున్నామని, గుండ్లుపేట నుంచి రెండు రెస్క్యూ టీమ్‌లను పంపినట్టు తెలిపారు.



చార్మాడిఘాట్‌లో కూలిన భారీ వృక్షం



ముధోళ తాలూకాలో మంత్రి కృష్ణబైరేగౌడ పర్యటన



బాగల్కోటె జిల్లా ఘటప్రభ నది ప్రవాహం ఇలా..

భద్ర గేట్లు ఎత్తివేత

బెంగళూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మధ్య కర్ణాటక జిల్లాలకు జీవనాడిగా పేరొందిన భద్ర జలాశయం దాదాపు నిండింది. మరో మూడు అడుగులు మాత్రమే ఉండడంతో డ్యామ్ కుడి, ఎడమ కాలువల నుంచి నీరు విడుదల చేశారు. మంగళవారం డ్యామ్ నాలుగు క్రస్ట్‌గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. శివమొగ్గ, దావణగెరె, చిత్రదుర్గ జిల్లాలకు అనుకూలం కానుంది. సోమవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మధుబంగారప్ప జిల్లా అధికారులు, భద్ర నీటి సలహా సమితి నేతృత్వంలో సమావేశం నిర్వహించి కాలువలకు నీటి విడుదల చేసేలా తీర్మానించారు. ఈ మేరకు నాలుగు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. పాల నురుగులా జలాశయం నుంచి నీరు వస్తుండడంతో స్థానికులు పెద్ద ఎత్తున చేరి సంతోషం వ్యక్తం చేశారు. భద్ర జలాశయానికి 20,774 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 6వేల క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా నిర్ధారించారు. గరిష్ఠంగా 186 అడుగుల ఎత్తు ఉన్న జలాశయం 183.2 అడుగులకు నీరు చేరింది. భద్ర డ్యామ్ నిండుతున్న తరుణంలో సాగుకు అనుకూలంగా నీటిని విడుదల చేస్తామని ఇటీవలే డీసీఎం డీకే శివకుమార్ ప్రకటించారు. అందుకు అనుగుణంగానే నీటిని వదిలారు. గత ఏడాది డ్యామ్‌లో జలాలు అడుగంటిన విషయం తెలిసిందే.



భద్ర జలాశయం నుంచి నీరు విడుదల ఇలా...

వయనాడ్ కార్యాచరణకు ఇద్దరు ఐఏఎస్‌లు

వయనాడ్‌లో కొండచరియలు విరిగి ఘోరమైన ప్రమాదం చోటు చేసుకోవడంతో రాష్ట్రం నుంచి ఇద్దరు ఐఏఎస్ అధికారులను కార్యాచరణకు నియమించారు. ఇక బెంగళూరులో ఉండే ఎన్‌డీఆర్ఎఫ్, మద్రాస్ ఇంజనీరింగ్ గ్రూప్ సైన్యం బలగాలను రంగంలోకి దింపారు. ఎంఈజీకి చెందిన ఒక అధికారి, ఇద్దరు జీసీఓలు, 70 మంది వివిధ ర్యాంకుల సిబ్బంది రక్షణ చర్యల కోసం 15 వాహనాల్లో తరలివెళ్లారు. 100 మంది సైనికులు 40 వాహనాలలో బయల్దేరారు. వీరు పరిహార సామగ్రితో పాటు అత్యవసరమైన వస్తువులు, మందులను తీసుకెళ్లారు. వైద్య సేవలకోసం హెచ్‌డీ కోటలో నిరంతరంగా ఆసుపత్రి, వైద్యులను అందుబాటులో ఉంచారు. సమీప ప్రాంతాల నుంచి తరలించేందుకు బస్సులు, అంబులెన్స్‌లను కేటాయించారు. సీనియర్ ఐఏఎస్ అధికారి పీసీ జాఫర్ (94483 55577), దిలీశ్ శశి (94460 00514)లను కార్యారణ కోసం కేటాయించారు. వయనాడ్ ప్రమాదంలో చిక్కుకున్న కన్నడిగులను రక్షించేందుకు చర్యలు ప్రారంభించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాష్ట్రంలో వరదలు, కొండగుట్టల ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చామరాజనగర జిల్లా అధికారి కార్యాలయంలో హెల్ప్‌లైన్ 0822 6223163, 161, 160లను కేటాయించారు. గుండ్లుపేట తాలూకాలో ఆసుపత్రులు నిరంతరంగా పనిచేసేలా సూచించారు. గుండ్లుపేట మార్గంగా వెళ్లే బెంగళూరు - వయనాడ్ జాతీయ రహదారి 766ను పూర్తిగా మూసివేశారు. ప్రత్యామ్నాయంగా గుండ్లుపేట, బండిపుర, గడలూరు మార్గంగా వెళ్లాలని సూచించారు. ఇక మైసూరులోనూ హెల్ప్‌లైన్ 0821 24223800 ఏర్పాటు చేశారు. ఢిల్లీలో ఉన్న సీఎం సిద్దరామయ్య కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను భేటీ అయ్యారు. సీఎం వెంట ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రి మహదేవప్ప, ఢిల్లీలో కర్ణాటక ప్రతినిధి టీబీ జయచంద్ర ఉన్నారు.



సీఎం ఢిల్లీ పర్యటనతో

మంత్రుల్లో గుబులు

- ముగ్గురు అసంతృప్తులకు అధిష్ఠానం పిలుపు
- కాంగ్రెస్ పార్టీలో సర్వత్రా ఇదే అంశంపై చర్చ



బెంగళూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సజావుగా సాగుతోందని, తిరుగులేని మెజారిటీ ఉందని భావిస్తున్నా రోజుకో చర్చ మలుపు తిప్పుతోంది. సుదీర్ఘ కాలం తర్వాత అధిష్ఠానం పెద్దలు ఢిల్లీకి రావాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను సూచించారు. వీరిద్దరు మాత్రమే ఢిల్లీ వెళ్లి ఉంటే భవిష్యత్తు రాజకీయాలు, ఇటీవల ప్రభుత్వంపై వచ్చిన ముడా ఆక్రమణలు, వాల్మీకి కార్పొరేషన్ అవినీతి అంశాలపై వివరణ ఇచ్చి వెనుతిరిగేవారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏర్పడినా కీలక నేతలు గతంలో మంత్రులుగా వ్యవహరించిన ముగ్గురు కేబినెట్‌లో చోటు లేక అసంతృప్తితో ఉన్నారు. వీరు దాదాపు క్రియాశీలక రాజకీయాల్లో కనిపించని విధంగా మారారు. ఇలా ముగ్గురు సీనియర్లను కూడా ఢిల్లీకి రావాలని ఆదేశించడమే అనేక సందేహాలకు దారితీస్తోంది. దీంతో మంత్రుల్లో గుబులు రేగుతోంది. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో కనీసం 15 నుంచి 18 స్థానాలు గెలుస్తామని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్, సీఎం సిద్దరామయ్య అధిష్ఠానానికి నివేదికల రూపంలో సమర్పించారు. కానీ 9 స్థానాలకే పరిమితం కావాల్సి వచ్చింది. ఆరేడుగురు మంత్రులు గెలుపు సాధించాలనే అధిష్ఠానం టార్గెట్‌తో వారసులను అభ్యర్థులను చేసుకున్నారు. గెలిస్తే ఎంపీలు, ఓడితే రాజకీయంగా ఎంట్రీ ఇచ్చినట్టు అవుతుందని భావించారు. వీటితోపాటు బెంగళూరు నగరంలోని మూడు స్థానాల్లోనూ ఓటమి చవిచూడడం, బెంగళూరు గ్రామీణలో డీకే శివకుమార్ తమ్ముడు డీకే సురేశ్ ఓడిపోవడం పార్టీకి బాగా ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. ఎన్నికల ఫలితాల తర్వాత ఓ కేసు విచారణకు వచ్చిన అగ్రనేత రాహుల్‌గాంధీ ఎన్నికల్లో నిర్లక్ష్యం చేసినవారిని బాధ్యులను చేయాలని పరోక్షంగా మంత్రి పదవుల నుంచి పక్కన పెట్టాలనే రీతిలో హెచ్చరించారు. అప్పటి నుంచే మంత్రులకు భయం వెంటాడుతోంది. ఇదే సందర్భంలోనే ఢిల్లీకి రావాలని అధిష్ఠానం పిలవడంతో ఇదే ప్రధానమైన అంశం ఉంటుందని భావించారు. ఈలోగానే అసంతృప్తులుగా ఉండే ముగ్గురు సీనియర్లను పిలవడం చర్చలకు దారితీస్తోంది. అయితే మంత్రుల్లో మాత్రం గుబులు పెరిగిందని చెప్పవచ్చు.

ఢిల్లీ వెళ్లిన ముగ్గురు నేతలు

ముగ్గురు సీనియర్ నేతలకు ఢిల్లీ నుంచి పిలుపు రావడంతో తరలివెళ్లారు. సీనియర్ నేతలు బీకే హరిప్రసాద్, ఎస్ఆర్ పాటిల్, తన్వీర్‌సేట్‌ను ఆహ్వానించడంతో వారు ఢిల్లీ వెళ్లినట్టు తెలుస్తోంది. బీకే హరిప్రసాద్ బీజేపీ పాలనవేళ పరిషత్ ప్రతిపక్షనేతగా వ్యవహరించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆయన మంత్రి అవుతారని భావించారు. కానీ బీకే హరిప్రసాద్‌ను పక్కనపెట్టారు. దాదాపు ఆయన శాసనసభ సమావేశాలకు దూరంగానే ఉంటున్నారు. సిద్దరామయ్య గత ప్రభుత్వంలో ఐటీబీటీతోపాటు పలు శాఖల మంత్రిగా, పరిషత్ సభా నాయకుడిగా వ్యవహరించిన ఎస్ఆర్ పాటిల్‌కు అవకాశం ఇవ్వలేదు. మైసూరుకు చెందిన సీనియర్ నేత తన్వీర్‌సేట్ గతంలో మంత్రిగా వ్యవహరించినా అతడికి అవకాశం రాలేదు. దీనికి తోడు కేపీసీసీ అధ్యక్షుడిగా డీకే శివకుమార్ గడువు ముగియడం కూడా కీలకమైన అంశమే. లోక్‌సభ ఎన్నికల్లో వారసులకు టిక్కెట్లు ఇప్పించుకోవడం ద్వారా పార్టీకి నష్టం జరిగిందని, మరికొందరు బెంగళూరులోనే మకాం వేసుకుని నిర్లక్ష్యం చేశారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. వీరిలో ఎవరిపై వేటు పడుతుందనేది ఆసక్తి కలిగిస్తోంది. ఢిల్లీలో మంగళవారం సుదీర్ఘమైన రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటాయని అందరూ భావించారు. కానీ కేరళ రాష్ట్రం వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో మృతుల సంఖ్య దాదాపు 90కు చేరడంతో రాహుల్‌గాంధీ బిజీ అయ్యారు. మరోవైపు బుధవారం రాహుల్‌గాంధీ వాయనాడుకు వస్తున్న తరుణంలో కీలకమైన అంశాలపై చర్చ జరగలేదని తెలుస్తోంది.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.72	1,623.71
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,31,821	69,339
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	93,684	1, 603
సామర్థ్యం (టీఎంసీలు)	100.68	72.36

ఘనంగా ఆడికృత్తిక పూజలు



కుమారస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

బళ్లారి రూరల్, జూలై 30 : బళ్లారి నగరం ఇన్‌ఫ్రంట్ రోడ్డు ఫైర్ ఆఫీసు సమీపంలో ఉన్న శ్రీ కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక పూజలను తెల్లవారుజామున 5 గంటల నుండి ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డితో పాటు నగరంలోని భక్తాదులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఈవో హనుమంతప్ప, ట్రస్టు సభ్యులు సుధాకర్, నిర్మల, కవిత, బసవరాజు, మల్లికార్జున, మూర్తి, ప్రకాష్, గోవింద తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



పనులను పరిశీలిస్తున్న సిటీ ఎమ్మెల్యే భరత్ రెడ్డి

బళ్లారిరూరల్, జూలై 30: బళ్లారి నగరంలోని అనంతపురం రోడ్డు రాయల్ సర్కిల్ నుంచి ఇంద్ర సర్కిల్ వరకు జరుగుతున్న రోడ్డుపనులను సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో వీలైనంత త్వరగా పనులు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫసల్‌బీమా యోజనను క్రమబద్ధీకరించాలి



వినతిపత్రం ఇస్తున్న జిల్లా అధ్యక్షుడు హనుమంతప్ప


బళ్లారిరూరల్, జూలై 30: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను క్రమబద్ధీకరించాలని హసురుసేన జిల్లా అధ్యక్షుడు హనుమంతప్ప నేతృత్వంలో వ్యవసాయ శాఖ జేడీ సోమసుందర్‌కు వినతి పత్రం అందించారు. రైతులకు ఇప్పటి నుంచి ఆధార్‌కార్డు ద్వారా పరిహారాన్ని అందించాలన్నారు. ప్రతి రైతు ఇన్సురెన్స్ మొత్తం చెల్లిస్తే కష్టాల్లో ఉన్న సమయంలో ఆదుకునేందుకు అనుకూలంగా వుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలిగప్ప, జిల్లా కార్య అధ్యక్షుడు సింధిగేరి గోవిందప్ప, వీరేష్ పాల్గొన్నారు.

6న కుడితిని బంద్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సంఘ సంస్థ నేతలు

కంప్లి, జూలై 30: ఆగస్టు 6న కుడితిని బంద్‌ను విజయవంతం చేయాలని వివిధ సంఘాల నేతలు విజ్ఞప్తిచేశారు. కుడితిని పరిధిలోని బ్రాహ్మణి, మిట్టల్, ఎన్‌ఎండీసీ కర్మాగారాలకు కుడితిని, హరిగిణదోణి, జానెకుంటి, వేణి వీరాపురం, కొలగల్లు, సిద్దమ్మనహళ్లి, ఎర్రంగళి తదితర గ్రామాల రైతులు భూములు పోగొట్టుకుని సుమారు 13 సంవత్సరాలు అవుతోందన్నారు. ఈ విషయంపై 590 రోజులకుపైగా నిరసనలు చేపడుతున్నా పట్టించుకోకపోవడంతో ఈ విషయంపైన ఆగస్టు 6న బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. కుడితిని పట్టణంలో సంఘసంస్థ నేతలు, సీఐటీయు, కర్ణాటక రక్షణ వేదిక, ఆధ్వర్యంలో పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జంగ్లి సాబ్, భావిశివకుమార్, తిమ్మప్ప, నరసింహరాజు, సంపత్, తిప్పేస్వామి పాల్గొన్నారు.



నీళ్లొదిలారు!

నీరులేక ఎండిపోతున్న కుడికాలువ ఆయకట్టు

- నిండిన భద్ర జలాశయం
- నాలుగుగేట్ల నుంచి నదిలోకి నీటి విడుదల
- కుడికాలువతోనే నీటివృథా నివారణ సాధ్యమంటున్న నిపుణులు
- 1959లోనే డీపీఆర్ సిద్ధం
- అడ్డుకుంటున్న స్థానిక నాయకులు

బళ్లారి సిటీ, జూలై 30: ప్రస్తుతం భద్ర నీరు వృథాగా ప్రవహిస్తోంది. నీటితో తొణికిసలాడుతున్నభద్ర డ్యామ్ నాలుగు క్రెస్ట్‌గేట్‌లను మంగళవారం ఎత్తి నీటిని నదికి విడుదల చేశారు. భద్ర జలాశయానికి 20,774 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఆరు వేల క్యూసెక్కులు అవుట్ ఫ్లో నమోదయింది. గరిష్ఠంగా 186 అడుగుల ఎత్తుఉన్న జలాశయంలో 183.2 అడుగుల మేర నీరు చేరింది. దీంతో నదిలోకి నీటిని విడుదల చేశారు. ఆ నీటిని నదిలోకి వదలకుండా కరువుతో ఇబ్బందిపడుతున్న పశ్చిమ తాలూకాలకు మళ్లించి చెరువులు నింపితే భూగర్భ జలాలు రీచార్జ్ అవ్వడమేకాకుండా ప్రజలకు, పశువులకు నిరంతరం తాగునీటి సౌకర్యం కలిగి ఉండేది ఇందుకు ఎన్నో ఏళ్ల స్వప్నమైన భద్రా కుడికాలువ ప్రాజెక్టు కార్యరూపం దాల్చాల్సి ఉంది. ఈప్రాజెక్ట్ పూర్తయితే హగరిబొమ్మనహళ్ళి తాలూకాలోని మాలవి రిజర్వాయర్‌కు నీటిని ఇవ్వడంతో పాటు చిత్రదుర్గ జిల్లాలోని మొల కాల్మూరు, జగలూరు, విజయనగరం జిల్లాలోని పశ్చిమ తాలూకాలు కూడ్లిగి, కొట్టూరు, హగరిబొమ్మనహళ్ళి, హడగలి, హరపనహళ్ళి తాలూకాల్లో నీరు పారించవచ్చు. 1959లో అప్పటి ముఖ్యమంత్రి నిజలింగప్ప , బాచిగొండనహళ్ళిలో ఈ ప్రాజెక్టుకు సంబంధించి ముసాయిదాను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపారు. కేంద్రప్రభుత్వం కూడా ఆమోదించింది. ఈప్రణాళికను స్వార్థ రాజకీయ నాయకులు క్రమపద్ధతిలో అడ్డుకున్నారు. కాబట్టి అది అమలుకాలేదు. నీటి కోసం ఖర్చుచేయకుండా రైతుల బతుకులు బాగుపడకుండా చేస్తున్నారు. ఈ సాగునీటి పథకం అమలుపై ఈ ప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపీలకు చిత్తశుద్ధి కొరవడిందని తెలుస్తోంది. భద్ర రిజర్వాయర్‌లో ఏళ్ల తరబడి పూడిక పేరుకుపోయింది. దీన్ని తొలగించేందుకు ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. నది పక్కనే ప్రవహించినప్పటికీ పశ్చిమ తాలూకాలలోని చెరువులు, డ్యామ్‌లు, చెక్‌డ్యాంలలో నీరులేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వీటిని నీటితో నింపితే నీటికి కొదవ ఉండదని శాస్త్రవేత్తలు అంటున్నారు.

ఎట్టకేలకు శాంతించిన తుంగభద్ర

కంప్లి వంతెనపై పేరుకుపోయిన చెత్తాచెదారం



కాలినడకన వంతెన దాటుతున్న ప్రయాణికులు

కంప్లి, జూలై 30 : ఎట్టకేలకు తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో ఇరువైపులా వుండే గ్రామాల ప్రజలు, రైతన్నలు ఊపిరిపీల్చుకున్నారు. గత ఏడు రోజులుగా వంతెనపై ఉప్పొంగి నీరు ప్రవహిస్తుండటంతో బళ్లారి జిల్లాలోని గ్రామాలు, పట్టణాలకు, కొప్పాళ జిల్లాలోని ఆయా గ్రామాలు, పట్టణాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడి ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కేవలం 20 వేల క్యూసెక్కులు మాత్రమే నదిలో ప్రవహిస్తున్నాయి. అధికారులు కాలినడకన మాత్రమే చిక్కజంతిగల్ నుంచి కంప్లికు, కంప్లి నుంచి చిక్కజంతిగల్‌కు వెళ్లేందుకు అవకాశం కల్పించారు. పురసభ అధికారులు అప్రమత్తమై వంతెనపై పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేందుకు నిమగ్నమయ్యారు. రెండు జిల్లాల అధికారులు అనుమతి అనంతరమే ద్విచక్రవాహనాల రాకపోకలకు అవకాశం కల్పిస్తామని తహసీల్దార్ తెలిపారు. నది ఒడ్డున ఉన్న ఆయా గ్రామాల ప్రజలు, రైతులు నీటి ప్రవాహం వున్న సమయంలో వెళ్లరాదని సూచించారు. నదిలో మత్స్యకారులు అనుమతులు లేకుండా తెప్పలు వేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

మానవ అక్రమ రవాణా ఆపాలి

అవగాహనా సదస్సులో న్యాయాధికారి రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ,జూలై 30: డ్రగ్స్, ఆయుధాల రవాణా సహా ప్రపంచంలోనే మానవ అక్రమ రవాణా మూడో అతిపెద్ద వ్యాపారమని జిల్లా న్యాయాధికారి రాజేశ్ హొసమనె అన్నారు. నగరంలోని జిల్లాపంచాయితీ హాల్లో మంగళవారం జరిగిన మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంలో భాగంగా మంగళవారం నిర్వహించిన ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో మైనర్ పిల్లలు ,మహిళలతో సహా ప్రజలు అక్రమ రవాణాకు



మానవ అక్రమరవాణాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

గురవుతున్నారన్నారు. లైంగిక దోపిడీ, భిక్షాటన, దాస్యం, బాలకార్మికులు, అవయవ మార్పిడి, బాల్యవివాహాలు, వ్యభిచార కార్యకలాపాలలో వీరిని ఉపయోగించుకుంటున్నారని, దీనిని పూర్తిగా నిర్మూలించాలన్నారు. విదేశాలకు తీసుకెళ్ళి పని ఇప్పిస్తామంటూ సామాన్యులకు మాయమాటలు చెప్పి మభ్యపెట్టే మానవ అక్రమ రవాణా కేసులు పెరగిపోతున్నాయని దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పేదరికం నుంచి తప్పించుకోవడానికి తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలను పనికి పంపడం శిక్షార్హమైన నేరమని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రజాప్రతినిధులు పనిచేయాలన్నారు. కార్యక్రమానికి జిల్లా పంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప అధ్యక్షత వహించి మాట్లాడుతూ, మానవ అక్రమరవాణా సమాజంలో నల్లమచ్చగా మారిందన్నారు. వివిధ శాఖల సంస్థాగత సహకారంతో తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా కృషి చేయాలన్నారు. మహిళా శిశు అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు విజయ్‌కుమార్ మాట్లాడుతూ మానవ అక్రమరవాణా నిరోధానికి గ్రామ పంచాయితీ స్థాయిలో విజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం జిల్లా పంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప ప్రమాణ స్వీకారం చేయించారు. అదనపు పోలీసుసూపరింటెండెంట్ నవీన్‌కుమార్, జిల్లా బాలల సంరక్షణ అధికారి జలాలప్ప పాల్గొన్నారు.

స్పర్శలేని మచ్చలు కుష్టు వ్యాధికి సంకేతం కావచ్చు

- నగర మేయర్ ముల్లంగి నందీశ్

బళ్లారి సిటీ, జూలై 30: శరీర చర్మంపై లేత తెలుపు, రాగి రంగు స్పర్శలేని మచ్చలు కనిపిస్తే అవి కుష్టువ్యాధి సంకేతాలు కావచ్చని నగర మేయర్ ముల్లంగి నందీశ్ తెలిపారు. జిల్లాఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దేవి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కుష్టువ్యాధి నిర్ధారణ ప్రచార కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లెప్రసీ కేసులవల్ల వచ్చే అంగవైకల్యాన్ని తగ్గించేందుకు, గుప్త కుష్టువ్యాధిని త్వరగా గుర్తించేందుకు ఆగస్టు 14 వరకు ఆరోగ్య కార్యకర్తలు ఆశా వర్కర్లు, వాలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని ఇందుకు ప్రజలు సహకరించాలని సూచించారు.

జిల్లా కుష్టువ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ వీరేంద్రకుమార్ ఈ వ్యాధిపై అవగాహన కల్పించారు. అనుమానిత కేసులు కనిపిస్తే వారికి రిఫరల్ ఫారం ఇస్తారని, సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా జిల్లా ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. వ్యాధిని నిర్ధారిస్తే రోగి లక్షణాల ప్రకారం ఆరు నెలలు లేదా ఒక సంవత్సరం పూర్తిగా ఉచిత చికిత్స అందిస్తారన్నారు. చికిత్స పూర్తయితే వ్యాధి పూర్తిగా నయమవుతుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈసందర్భంగా జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ అబ్దుల్లా, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్‌దాసప్పనవర్, వైద్యాధికారి డాక్టర్ సుధరాణి, డీఎఫ్ఐటీ కోఆర్డినేటర్ సుదాకర్,లెప్రసీ



జెండాఊపి కుష్టు అవగాహన వాహనాన్ని ప్రారంభిస్తున్న మేయర్

విభాగం సుమన్, మానప్ప, పంపయ్యస్వామి, బళ్లారి తాలూకా సూపరింటెండెంట్ ముస్తాక్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరపాలి



నేతలతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాఘవేంద్రరావు

కంప్లి, జూలై 30 : ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకుందామని కురుగోడు తహసీల్దార్ రాఘవేంద్ర తెలిపారు. ఉదయం కురుగోడు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో పట్టణ ప్రముఖులు, సంఘ సంస్థ నేతలు, అధికారులతో ముందస్తుసమావేశం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల క్రీడాంగణంలో పాఠశాలల విద్యార్థులు వేడుకల్లో పాల్గొనాలన్నారు. ఈ వేడుకల్లో దేశ స్వాతంత్ర్య పోరాట యోధుల నాటకాలు, వివిధ ధార్మిక కార్యక్రమాలు నిర్వహిద్దామన్నారు. అనంతరం పట్టణ ప్రముఖులు ర్యాలీ కూడా చేపట్టే విషయంపై చర్చించారు. మూడురంగుల జెండాలతో ర్యాలీ చేపడితే మరింత బాగుంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ వేడుకలకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేశప్ప, విజయ్‌కుమార్, చెన్న బసవరాజు, గాదెలింగప్ప, మృత్యుంజయ, బసవరాజు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని పాదచారి మృతి



బస్సు ఢీకొని మృతి చెందిన రాజన్న

బళ్లారిరూరల్, జూలై 30 : బళ్లారి నగరంలో మోతి సర్కిల్ వద్ద కేఎస్ఆర్టీసీ కేఏ 35 ఎఫ్ 340 బస్సు ఓ పాదచారిని ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. బళ్లారి బజార్ ప్రదేశానికి చెందిన రాజన్న (62) నిత్యం కూలీ పనులకు వెళ్లేవాడు. మంగళవారం కూడా మామూలు గానే పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో వెనుక నుండి ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా ఉప్పర వెంకోబ



నూతన అధ్యక్షుడు వెంకోబను పూలమాలలతో సన్మానిస్తున్న దృశ్యం

సిరుగుప్ప, జూలై 30 : సిరుగుప్ప తాలుకా న్యాయవాదుల సంఘం నూతన అధ్యక్షునిగా ఉప్పర వెంకోబ ఎంపికయ్యారు. పట్టణ న్యాయవాదుల అసోసియేషన్ భవనంలో జరిగిన ఎన్నికల్లో 103 ఓట్లు దక్కించుకుని భారీ మెజార్టీతో గెలుపొందారు. ఎన్నికల్లో 174 మంది ఓటర్లు ఉన్నప్పటికీ 172 ఓట్లు పోలింగ్ కాగా అందులో ఉప్పర వెంకోబకు 103 ఓట్లు, ప్రత్యర్థి అభ్యర్థి రఘునందన్‌కు 69 ఓట్లు పడ్డాయి. అత్యధిక ఓట్లతో గెలుపొందిన ఉప్పర వెంకోబను న్యాయవాదుల సంఘం మాజీఅధ్యక్షులు గంగారాం సింగ్, న్యాయవాదులు వెంకటేష్‌నాయక, మంజునాథ, వీరణ్ణ తదితరులు పూలమాలలు వేసి సన్మానించారు.

సేద్యం చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలి



భూముల వద్ద నిరసన చేపడుతున్న రైతులు

కంప్లి, జూలై 30 : కురుగోడు పరిధిలోని సింధిగేరి రోడ్డులోని చెరువులో సేద్యం చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలంటూ శివశంకర్ నేతృత్వంలో సుమారు 150 రోజులుగా నిరసనలు చేస్తున్నారు. కురుగోడు తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నిరసనలు చేపట్టారు. కానీ ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో మంగళవారం కర్ణాటక ప్రాంత రైతు సంఘం ఆధ్వర్యంలో కురుగోడు నుంచి పొలాల వరకు కర్ణాటక ప్రాంత రైతు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం శివశంకర్, గాలి బసవరాజు మాట్లాడుతూ రైతులు తమ వంశపారంపర్యంగా సేద్యం చేస్తున్న భూములకు పట్టాలిచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. భీమయ్య, అంబన్న, హాలెప్ప, రుద్రప్ప, మారెప్ప, శంకరప్ప, పరశురామ్, శ్రీనివాస్, నీలప్ప, డాక్టర్ అంబేద్కర్ సంఘాల నేతలు పాల్గొన్నారు.

హొసూరు జోన్

అడవి ఏనుగు పట్టివేత



అడవి ఏనుగును పట్టేసిన అటవీ శాఖ సిబ్బంది

హొసూరు జూలై 30: హొసూరు సమీపంలోని కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ముగ్గురిని బలి తీసుకున్న ఏనుగును 8 కుంకీ ఏనుగుల సాయంతో అటవీశాఖ అధికారులు మంగవారం పట్టుకున్నారు. బన్నేరుఘట్ట నేషనల్ పార్క్ పక్కనే ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో అడవి ఏనుగు ప్రజలను, రైతులను బెదిరిస్తూ సంచరిస్తుండేది. ఆ ప్రాంతంలో దాని దెబ్బకు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఆ ఏనుగును పట్టుకోవాలని అటవీశాఖను సహాయం కోరారు. ఈ క్రమంలో కర్ణాటక రాష్ట్రంలోని దుబరే , మత్తికోడు క్యాంపుల నుంచి 8 కుంకీ ఏనుగులను రప్పించి, వాటి సాయంతో అడవిలోకి వెళ్లి అడవి ఏనుగు కోసం వెతికారు. అటవి ఏనుగు ఆచూకీ కోసం డ్రోన్ కెమరాలు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అది లోయల్లో ఉన్నట్లు తెలిసింది. అటవీ శాఖ మత్తుమందు నిపుణుడు రంజన్‌తో పాటు వెళ్లి కుంకీ ఏనుగుల సహాయంతో అటవి ఏనుగుకు తుపాకీతో మత్తుమందు ఇచ్చారు. కిలోమీటరు దూరం వెళ్లిన ఆ అటవీ ఏనుగు స్పృహ కోల్పోయి పడిపోయింది. అక్కడ దానిని బలమైన తాడులతో బంధించి భీమా, మహేంద్ర ఏనుగుల సాయంతో పట్టుకున్నారు. తర్వాత లారీలోకి ఎక్కించి బన్నేరుఘట్ట నేషనల్ పార్క్‌లోని సిగ్గేకట్టు ఏనుగుల శిబిరానికి తరలించారు. ఈ పనిలో 100 మందికి పైగా అటవీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఉత్తరాది యువకుడి అరెస్ట్



అజయ్‌కుమార్

హొసూరు(క్రైం) జూలై 30: పోక్సో చట్టం కింద ఉత్తరాది యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. జార్ఖండ్ రాష్ట్రం బిలాం జిల్లా పోర్సం గ్రామానికి చెందిన అజయ్‌కుమార్(20) హొసూరు సమీపంలోని బత్తలపల్లిలో ఉంటూ హొసూరులోని రెండవ సిప్‌కాట్‌లోని ఓ ప్రైవేట్ కర్మాగారంలో పనిచేస్తున్నాడు. రెండవ సిప్‌కాట్ ప్రాంతంలోని కుముదేపల్లి ప్రాంతంల్లో నివాసముంటున్న ఓ బాలిక(14)ను ప్రేమిస్తున్నానని చెప్పి అతడు తాను ఉంటున్న గదికి తీసుకువెళ్లాడు. ఈ విషయంపై బాలిక తల్లి హొసూరు మహిళా పోలీస్‌స్టేషన్‌లో.. అజయ్‌కుమార్.. తన కుమార్తెపై లైంగిక దాడి చేశాడని ఫిర్యాదు చేయడంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేసి ధర్మపురి జైలుకు తరలించారు.

రోడ్డుపైకి మురుగునీరు..



బాగలూరు రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

హొసూరు(సిప్‌కాట్) జూలై 30: హొసూరు ప్రాంతంలోని బాగలూరు రోడ్డు శ్రీకృష్ణ ఆలయం రోడ్డులో కాలువ మూసుకుపోవడంతో వర్షపునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ రహదారిపై ప్రతిరోజు వేలాది మంది ప్రయాణిస్తుంటారు. వేలాది ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు వెళ్తుంటాయి. ఈ రోడ్డు ప్రధాన రహదారి కావడంతో రెస్టారెంట్లు, షాపులు ఉన్నాయి. మురుగు కాలువలను శుభ్రం చేయట్లేదు. దీంతో వర్షం వస్తే మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. ఈ విషయంపై కార్పొరేషన్ చర్యలు తీసుకోవాలని ప్రాంత వాసులు కోరుతున్నారు.

సీఐడీ కస్టడీకి అక్రమ డిపాజిట్ల కేసు నిందితులు



నిందితుడిని కస్టడీలోకి తీసుకుంటున్న పోలీసులు

రాయచూరు, జూలై 30: అధికవడ్డీ ఆశతో పెద్ద ఎత్తున డిపాజిట్‌లు స్వీకరించారన్న ఆరోపణ మేరకు ఇద్దరు ఏజెంట్లను మంగళవారం సీఐడీ పోలీసులు న్యాయస్థానానికి అప్పగించి కస్టడీలోకి తీసుకున్నారు. స్థానిక ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన డాక్టర్ వసీమ్, అఖిల్ అనే ఇద్దరు నిందితులు దర్వేష్ కంపెనీలో ఏజెంట్‌లుగా ఉండి స్థానికుల నుంచి పెద్ద ఎత్తున డిపాజిట్‌లు సేకరించారన్న ఆరోపణల మేరకు వారిపై కేసు నమోదు చేసిన క్రైం బ్రాంచ్ పోలీసులు వారిని న్యాయస్థానానికి అప్పగించారు. న్యాయస్థానం వారిని సీఐడీ కస్టడీకి ఇచ్చారు. కాగా మొత్తం వ్యవహారంలో ప్రధాన నిందితుడిగా ఉన్న మహ్మద్ సుజా మరో ఏజెంట్ కోసం గాలింపు చేపట్టారు.

అవినీతి కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెడతాం



మాట్లాడుతున్న ప్రసాద్ అబ్బయ్య

రాయచూరు, జూలై 30 : ప్రధాన మంత్రి ఆవాస్ పథకం ద్వార ఇళ్లు నిర్మించి ఇస్తామని లబ్ధిదారులను మోసగించిన కాంట్రాక్టర్‌లను బ్లాక్ లిస్ట్‌లో పెడుతామని కర్ణాటక మురికివాడల అభివృద్ధి మండలి చైర్మన్ ప్రసాద్ అబ్బయ్య అన్నారు. మురికివాడల ఇళ్ల నిర్మాణం అభివృద్ధి పనులకు సంబంధించి మంగళవారం జిల్లా స్థాయి అధికారులతో అబ్బయ్య సమావేశం నిర్వహించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడిన అబ్బయ్య, గతంలో ప్రధాన మంత్రి ఆవాస్ పథకం ద్వార చేపట్టిన ఇళ్ల నిర్మాణంలో కాంట్రాక్ట్ పొందిన వారు ఇళ్ల నిర్మాణాన్ని సబ్ కాంట్రాక్ట్ ఇవ్వగా అనేక మంది ఇళ్లు నిర్మించకుండానే లబ్ధిదారులను మోసగించారన్నారు. దీని పై సమగ్ర విచారణ జరిపి కాంట్రాక్టర్‌లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టడంతో పాటు కఠిన చర్యలకు గృహ నిర్మాణ శాఖ మంత్రికి ఇప్పటికే ఫిర్యాదు చేశామన్నారు. కాగా జిల్లాలోని మురికివాడల అభివృద్ధిలో భాగంగా నిరుపేదలకు ఇప్పటికే ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామని ఇళ్ల నిర్మాణానికి త్వరలో చర్యలు చేపడుతామన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

ఇగ్నేషియస్ ఆఫ్ లయోలా (వర్ధంతి)



'సెయింట్ ఇగ్నేషియస్ ఆఫ్ లయోలా 1491 అక్టోబరు 23న జన్మించారు. స్పానిష్ బాస్కె క్యాథలిక్ ప్రీస్ట్, వేదాంతవేత్త. ఆధ్యాత్మిక విధానమైన 'సొసైటీ ఆఫ్ జీసస్' వ్యవస్థాపకులలో ఒకరు. 1541లో పారిస్‌లో సుపీరియర్ జనరల్‌గా పేరొందారు. ధ్యానం, మానసిక అభ్యాసాలతో ఆధ్యాత్మికవేత్తగా రాణించి 'సెయింట్' (పవిత్ర వ్యక్తి)గా గుర్తింపు పొందారు. 1556 జూలై 31న కన్నుమూశారు.

మహమ్మద్ రఫీ (వర్ధంతి)



'పద్మశ్రీ' గ్రహీత, ప్రఖ్యాత నేపథ్య గాయకుడు మహమ్మద్ రఫీ 1924 డిసెంబరు 24న పంజాబ్ రాష్ట్రంలో కోట్లా సుల్తాన్‌సింగ్ ప్రాంతంలో జన్మించారు. తనదైన గాత్రంతో శ్రోతలను అలరించారు. శృంగార, విషాద, గజల్స్, భజనలు సహా అన్ని రకాల క్లాజికల్ పాటలకు ఆయన పెట్టింది పేరు. ప్రత్యేకించి హిందీలో శంకర్ - జైకిషన్ సంగీత దర్శకుల ద్వయంతో కలసి పాడిన పాటలు సూపర్ హిట్‌గా నిలిచాయి. హిందీ, ఉర్దూ, మరాఠీ, తెలుగు సహా 17 భాషలలో 7వేలకుపైగా పాటలు పాడారు. ఒక జాతీయ అవార్డు, 4 ఫిల్మ్‌ఫేర్ సహా 'బెస్ట్ సింగర్ ఆఫ్ ది మిలీనియమ్' ఇతర పురస్కారాలు అందుకున్నారు. 1980 జూలై 31న కన్నుమూశారు.

అల్లు రామలింగయ్య (వర్ధంతి)



'పద్మశ్రీ' గ్రహీత అల్లు రామలింగయ్య 1922 అక్టోబరు 1న పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో జన్మించారు. సినీ నటుడు, నిర్మాత. నాటకాల్లో నటిస్తూనే మహాత్మా గాంధీజీ పిలుపుతో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు కెళ్లాడు. అనంతరం సినిమాల్లో కామెడీ విలన్, క్యారెక్టర్ పాత్రలతో 1030 సినిమాలలో నటించి మూడుతరాల ప్రేక్షకులను అలరించారు. రఘుపతి వెంకయ్య అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. 2013లో భారత చలన చిత్ర పరిశ్రమ వందేళ్లు పూర్తైన సందర్భంగా విడుదలైన 50 తపాలాబిళ్లలలో ఆయన జ్ఞాపకార్థం ఒకటి ఉంది. 2004 జూలై 31న కన్నుమూశారు.

ఎమిలి జేన్ బ్రాంట్ (జయంతి)



ప్రముఖ ఆంగ్ల నవలా రచయిత్రి, కవయిత్రి 1818 జూలై 31న జన్మించారు. 'ఉదరింగ్ హైట్స్' రచన ఆంగ్ల సాహిత్యంలో ఉత్తమ నవలగా నిలిచింది. పద్యాలను సోదరీమణులతో కలసి ప్రచురించారు. ఎల్లిస్‌బెల్ కలంతో రచనలు ప్రచురించారు. 30వ యేట 1848 డిసెంబరు 19న కన్నుమూశారు.

జేకే రౌలింగ్ (పుట్టినరోజు)



కలం పేరు 'జేకే రౌలింగ్'తో గుర్తింపు పొందిన జోఆన్నె రౌలింగ్ 1965 జూలై 31న జన్మించారు. బ్రిటీష్ దేశ రచయిత్రి, మాన వతావాది, సినీ నిర్మాత, బుల్లితెర నిర్మాత, స్క్రీన్ రైటర్‌గా రాణించారు. హారీ పాటర్ నటించిన ఫాంటసీ సిరీస్‌కు ఆమె రచనలు చేశారు. రాబర్ట్ గల్‌బ్రైత్ పేరిట క్రైం ఫిక్షన్‌లు రాశారు. అత్యధిక ప్రభావిత బ్రిటీష్ మహిళల్లో ఒకరుగా నిలిచారు. సాహిత్య, మానవతా సేవలకు 'ఆర్డర్ ఆఫ్ ది కంపానియన్స్ ఆఫ్ హానర్' గుర్తింపు పొందారు. రాయల్‌సొసైటీలో గౌరవ సభ్యురాలు. కొవిడ్ క్లిష్టంలో సామాజిక సేవలందించారు. 2021లో కోర్మరన్ స్ట్రైక్ సిరీస్ 5వ వాల్యూమ్‌కు థ్రిల్లర్ ప్రైజ్ అందుకున్నారు.

టీబీ డ్యాంలో 101 టీఎంసీల నిల్వ



నీటితో తొణికిసలాడుతున్న టీబీ డ్యాం

బొమ్మనహాళ్, జూలై 30: తుంగభద్ర జలాశయంలో 101.890 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు మంగళవారం సాయంత్రం తెలిపారు. తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతాల్లోని శివమొగ్గ, అగుంబే, శృంగేరి, చిక్కమంగళూరు వర్షాడు తదితర ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. దీంతో ఇన్‌ఫ్లో తగ్గింది. సోమవారం 1,31,179 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో మంగళవారం సాయంత్రానికి 68,630 క్యూసెక్కులకు పడిపోయింది. దీంతో మొత్తం 33 క్రస్ట్‌గేట్లలో 12 గేట్లు మాత్రమే రెండు అడుగులు మేర ఎత్తి 40,160 క్యూసెక్కులు తుంగభద్ర నదికి, 9553 క్యూసెక్కులు కాలువలకు విడుదల చేశారు. డ్యాం కెపాసిటీ 1633 అడుగులతో 107.788 టీఎంసీలు ఉండగా మంగళవారం సాయంత్రానికి 1632.03 అడుగులతో 101.890 టీఎంసీల నీటి నిల్వ ఉంచి మిగిలిన నీటిని బోర్డు అధికారులు దిగువకు వదులుతున్నారు. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105 కి.మీ. వద్ద 1210 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

రేపటి నుంచి హంద్రీనీవాకు నీరు

అనంతపురం క్లాక్ టవర్, జూలై 30: హంద్రీనీవాకు ఆగస్టు ఒకటిన నీటి విడుదల చేయనున్నట్లు కేఆర్ఎంబీ ప్రకటించిందని జిల్లా జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. నీటి విడుదల కోసం జలవనరుల శాఖ జిల్లా సీఈ నాగరాజ, హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ దేసేనాయక్ కృష్ణ రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు లేఖ రాసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం శ్రీశైలం డ్యాంలో 883అడుగుల మేర 204టీఎంసీల నీటి నిల్వ ఉంది. దీంతో మల్యాల నుంచి రెండు పంపుల ద్వారా కృష్ణా జలాలను హంద్రీనీవాకు విడుదల చేయనున్నారని తెలిపారు. ఇప్పటికే శ్రీశైలం డ్యాంకు ఇన్‌ఫ్లో మూడు లక్షల క్యూసెక్కులకుపైగా ఉందన్నారు. ఒకటిన మొదట మల్యాల నుంచి వెయ్యి క్యూసెక్కుల ప్రకారం హంద్రీనీవా కాలవకు నీరు వదలనున్నారని తెలిపారు. నీరు వదిలిన సమయం నుంచి ఐదురోజుల్లో కృష్ణా జలాలు జిల్లా సరిహద్దుల్లోకి చేరుతాయన్నారు. ఈ ఏడాది హంద్రీనీవాకు పూర్తి స్థాయి కేటాయింపులు 40టీఎంసీలు వచ్చే అవకాశం ఉందన్నారు.

బీడీఏ కాంప్లెక్స్ ప్రైవేటీకరణ చేయరాదు

» ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి

బొమ్మనహళ్ళి, జూలై 30: హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని బీడీఏ కాంప్లెక్స్‌ను ప్రైవేటీకరణ చేయదలిచిన ప్రభుత్వ నిర్ణయంపై ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి ఖండించారు. మంగళవారం హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని బీడీఏ కాంప్లెక్స్‌లో స్థానికులు, దుకాణదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 20 సంవత్సరాలకుపైగా బీడీఏ కాంప్లెక్స్ స్థానిక ప్రజలకు అందుబాటులో ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కాంప్లెక్స్‌ను కూల్చివేసి కొత్త నిర్మాణాలు చేపట్టి ప్రైవేటీకరణ చేయదలిచిందన్నారు. విశాలమైన ఐదున్నర ఎకరాలలో నిర్మించి కాంప్లెక్స్ ఉందన్నారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, కూరగాయలు, ఇతర నిత్యావసర దుకాణాలు ఇక్కడ ఉన్నాయన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ఉన్న భవనాన్ని ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. 15 సంవత్సరాలక్రితమే దీన్ని కూల్చివేయాలని భావించారని అప్పట్లోనే అడ్డుకోవడంతో జాప్యం చేశారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కాంప్లెక్స్‌ను కూల్చివేసేందుకు దుకాణదారులకు నోటీసులు ఇచ్చారన్నారు. కాగా ఇక్కడ మౌలిక సదుపాయాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై కోర్టును ఆశ్రయించి న్యాయ పోరాటానికి సిద్ధమన్నారు. ఇందుకు సంబంధించి ఒక మంత్రి ప్రమేయం ఉందన్నారు. త్వరలోనే గవర్నర్, సీఎం, డీసీఎంలకు వినతిపత్రం సమర్పిస్తామన్నారు. కాగా ప్రభుత్వ నిర్ణయంపై కాంప్లెక్స్‌లోని దుకాణదారులు తమ సమస్యలను ప్రస్తావించారు. బీడీఏ కాంప్లెక్స్ ప్రదేశంలో భూమి విలువ పెరిగిందని, ఇంతటి విలువైన దాన్ని ప్రైవేటీకరణ చేయదలచుకోవడం సమంజసం కాదన్నారు. బీడీఏ కాంప్లెక్స్ పోరాట సమితి నిర్వాహకుడు నాగేశ్, శ్రీనివాస్, బీఎస్ రెడ్డి, శైలజ, సయ్యద్ సలాం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి

చదువులో నైపుణ్యం సాధిస్తే కోరుకున్న ఉద్యోగాలు

» ఎయిమ్స్ గ్రాడ్యుయేషన్ డేలో ఉమారెడ్డి పిలుపు

బెంగళూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చదువులో నైపుణ్యత సాధిస్తే కోరుకున్న ఉద్యోగాలు వరిస్తాయని హైటెక్ మ్యాగ్నెటిక్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఎండీ ఉమారెడ్డి పిలుపునిచ్చారు. ఎయిమ్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 27వ గ్రాడ్యుయేషన్ డే జరిగింది. బెంగళూరు యూనివర్సిటీ కంప్యూటర్ విభాగం మాజీ చైర్మన్ హనుమంతప్ప, ఎయిమ్స్ ఈడీ, ప్రిన్సిపాల్ డాక్టర్ రోజా రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ బీఎం రామమూర్తి, డాక్టర్ కరుణాకరరెడ్డి, డాక్టర్ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఉమారెడ్డి మాట్లాడుతూ బెంగళూరు వంటి మహానగరం విద్యతోపాటు ఉద్యోగాలకు తగిన ప్రాంతమని కొనియాడారు. డిగ్రీలు పొందడం ద్వారా భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. కేవలం చదువు ముగిసిందని భావిం చరాదని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలంటే పరిశోధనలవైపు ఆలోచించాలన్నారు. డాక్టర్ హనుమంతప్ప మాట్లాడుతూ సాంకేతిక ప్రపంచంలో ఆవిష్కరణల పాత్ర కీలక మన్నారు. సాంకేతికతతో సమ్మిళితం కావాల్సిన సమాజంలో యువ విద్యార్థులుపోటీ పడాల న్నారు. బీఏ, బీసీఏ, బీహెచ్ఎం, బీకామ్, బీబీఏ, ఏవియేషన్ విభాగాలలో 200మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు.



ఎయిమ్స్ గ్రాడ్యుయేషన్ డేలో ప్రముఖులు

డీకేను సీఎం చేసేందుకేనా..?

» విజయేంద్ర పాదయాత్రపై బీజేపీ ఎమ్మెల్యే యత్నాళ్

బెంగళూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా)లో అవినీతిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర చేపడుతున్న పాదయాత్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు వ్యతిరేకమా..? లేదా డీకే శివకుమార్‌ను సీఎం చేసేందుకేనా..? అనేది వేచి చూడాలని విజయపుర బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ వ్యాఖ్యానించారు. బెళగావి జిల్లా అథణ తాలూకా హల్యాళ గ్రామంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో మునిగిపోయిందని ఆరోపించారు. వాల్మీకి కార్పొరేషన్ నిధులు లూటీ చేశారని అన్నారు. ముడా ఇళ్లపంపిణీ వ్యవహారంలో దళిత రైతుల భూములను మింగేశారని పేర్కొన్నారు. వీటిపై శాసనసభతోపాటు బయట ఎలాంటి అంతర్గత ఒప్పందం లేకుండా పోరాటం చేశామని తెలిపారు. ముడా ఆక్రమణలను ముందు పెట్టుకుని విజయేంద్ర పాదయాత్ర డీకే శివకుమార్‌కు మద్దతుగా చేసినట్టు ఉందని ఆరోపించారు. రాష్ట్రంలో గ్యారెంటీలు నిలిచిపోయాయని, గృహలక్ష్మి సొమ్ము లబ్ధిదారులకు అందడం లేదన్నారు. భాగ్యలక్ష్మి మాత్రం బెళగావిలో కూర్చున్నారని మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. నిధులు విడుదల చేయాలని, లేదంటే ఇంటికి పోవాలని మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌ను డిమాండ్ చేశారు. మాజీ మంత్రి, గోకాక్ ఎమ్మెల్యే రమేశ్ జార్కిహొళి మాట్లాడుతూ తండ్రీకొడుకులు ఇంతకాలం బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేశారని, వారి చేతుల్లోనుంచి పార్టీని బయట పడేలా హైకమాండ్‌ను కోరుతా అన్నారు. సిద్దరామయ్య కంట్రోల్ తప్పారని, స్వయంగా డీకే శివకుమార్ చేతుల్లోనే ఆయన ఉన్నారని తెలిపారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతిని ఖండిస్తున్నట్టు తెలిపారు. వాల్మీకి సముదాయానికి న్యాయం చేయాలన్నారు. ముడా అంశం వ్యక్తిగతం అన్నారు.



మీడియాతో యత్నాళ్, రమేశ్ జార్కిహొళి

లయన్స్‌క్లబ్ సేవలు గ్రామాలకు విస్తరించాలి

శిడ్లఘట్ట, జూలై 30: కులమతాలకు అతీతంగా అన్నివర్గాల సంక్షేమానికి పాటు పడతున్న లయన్స్‌క్లబ్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించాలని దేవేగౌడ జయప్రకాశ్ నారాయణ చారిటబుల్ ట్రస్టు ముఖ్యులు మేలూరు సచిన్ అభిప్రాయపడ్డారు పట్టణంలోని నగరేశ్వర కల్యాణమండపంలో లయన్స్‌క్లబ్ పదాధికారుల బాధ్యతల స్వీకరణ వేళ టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్నవారికి కుట్టుయంత్రాలను, ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందని వారి సేవలకు తమ వంతు సహకారం ఉంటుందన్నారు. ధ్యానం గురించి ప్రసంగించారు. ఇదే సందర్భంగా ఒక విద్యార్థినికి 10 వేల రూపాయల స్కాలర్‌షిప్ అందజేశారు. అధికసార్లు రక్తదానం చేసిన చిక్కబళ్ళాపురకు చెందిన సూర్యనారాయణశెట్టిని సన్మానించారు. లయన్స్‌క్లబ్ బీఎస్ రాజశేఖరయ్య, తాలూకా అధ్యక్షుడు మనోహర్, అజయ్, విజయ్‌కుమార్, ఎస్ఎన్ మంజునాథ్, చిత్ర మనోహర్, రజిత అజయ్, నారాయణస్వామి, న్యాయవాది మునిరాజు, చేతన్, కృష్ణయ్యశెట్టి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కుట్టు యంత్రాలు, ఉపకరణాల పంపిణీలో పాల్గొన్న లయన్స్‌క్లబ్ పదాధికారులు

విద్యతోపాటు వ్యాయామం అవసరం



క్రీడాపోటీల ప్రారంభంలో ప్రముఖులు

విజయపుర, జూలై 30: పిల్లలకు విద్యతోపాటు వ్యాయామం అవసరమని ప్రభుత్వ పీయూ కళాశాల సీనియర్ విద్యార్థి, సమాజసేవకుడు షఫీవుల్లా అభిప్రాయపడ్డారు. దేవనహళ్ళి తాలూకాలోని విజయపుర పట్టణ ప్రభుత్వ పీయూ కళాశాల క్రీడామైదానంలో బెంగళూరు గ్రామీణ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 2024-25 వార్షిక క్రీడాపోటీలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధి సమితి ఉపాధ్యక్షుడు ఏఆర్ హనీఫుల్లా మాట్లాడుతూ నిత్యం పలు సమస్యలతో ఉండే మానవుడికి ఆరోగ్యం ముఖ్యమన్నారు. గతంలో పొలాల్లో, తోటల్లో ఎంతో పనిచేసేవారన్నారు. ఇటీవలికాలంలో శారీరక శ్రమ తగ్గిందన్నారు. పురసభ మాజీ అధ్యక్షురాలు విమలా బసవరాజు మాట్లాడుతూ నిరంతర అభ్యాసంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, పిల్లలకు క్రీడా పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. పావురాలను గాలిలోకి వదలడం ద్వారా పోటీలు లాంచనంగా ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. సంగీత ఉపాధ్యాయురాలు శ్రీదేవి రఘు, ప్రభుత్వ బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాజు అవళేకర్, ప్రభుత్వ పీయూ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్, పురసభ మాజీ ఉపాధ్యక్షుడు కేశవప్ప, పురసభ సభ్యుడు, రాజణ్ణ, జిల్లా వ్యాయామ విభాగం అధికారి జాతీయ పురస్కార గ్రహీత రమేశప్ప తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు వ్యాపారులు సహకరించాలి : డీఎస్పీ

చింతామణి, జూలై 30: నేరాల నియంత్రణకు ప్రజలతోపాటు వ్యాపారస్తుల సహకారం ఎంతో అవసరమని డీఎస్పీ మురళీధర్ అభిప్రాయపడ్డారు. పట్టణంలో ఇటీవల కొంతకాలంగా దుకాణాలలో నగల చోరీలు, మహిళలను అడ్డుకుని చోరీలకు పాల్పడున్న ఘటనల నేపథ్యంలో టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ మురళీధర్ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ నగల కొనుగోళ్లకు వచ్చేవారి వివరాలు అంటే ఆధార్‌కార్డు జిరాక్స్ పొందడంతోపాటు అవసరమైతే పాన్‌కార్డు ఇతరత్రా పొందుపరచాలన్నారు. కొనుగోలుదారులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. పట్టణంలోని బంగారు, వెండి ఆభరణాల దుకాణాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తద్వారా వ్యాపార లావాదేవీలతోపాటు స్థానికంగా నిఘా సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజికుమార్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో డీఎస్పీ మురళీధర్

టైలరింగ్‌తో జీవనోపాధి

దొమ్మసంద్ర, జూలై 30: ఆనేకల్‌లోని సమగ్ర గ్రామీణ సమృద్ధి కేంద్రం జ్ఞానజ్యోతి సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్ తరగతుల శిబిరం ముగియడంతో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సంస్థ ముఖ్యులు ఫాదర్ ఐవన్ మెండోన్స్, కార్యదర్శి ఫాదర్ సిప్రియన్ టెల్లిస్, డైరెక్టర్ ఫాదర్ అర్విన్ జీవన్‌పాయ్స్ పాల్గొన్నారు. ఫాదర్ ఐవన్ మాట్లాడుతూ మహిళలు తమ ప్రతిభతో సమాజానికి చక్కటి సేవ అందించవచ్చునన్నారు. తాము పొందిన తర్ఫీదుతో టైలరింగ్ ద్వారా జీవనం సాగించవచ్చునన్నారు. ట్రైనింగ్ పూర్తి చేసిన 35మందికి ప్రమాణ పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణపత్రాలతో తర్ఫీదు పొందిన మహిళలు తదితరులు

1న బంగారపేటకు కన్నడ జ్యోతి రథయాత్ర రాక



సమావేశంలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

బంగారపేట, జూలై 30: కర్ణాటక నామకరణానికి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా కన్నడ సంబర జ్యోతి రథయాత్ర రాష్ట్రంలోని ప్రతి తాలూకాలోనూ సంచరించేలా తమ ప్రభుత్వం అమలు చేస్తోందని కర్ణాటక నగర మౌలిక సదుపాయాలు, అభివృద్ధి ఆర్థిక మండలి అధ్యక్షుడు ఎస్ఎన్ నారాయణస్వామి వెల్లడించారు. పట్టణంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బంగారపేట సరిహద్దుకు ఆగస్టు 1న రానుందన్నారు. బంగా రపేట నుంచి కోలారుకు వెళ్లే సందర్భంగా గ్రామాలలో జ్యోతిరథయాత్రను ఘనంగా స్వాగతిం చాలన్నారు. తాలూకాలోని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఆహ్వానం పంపాలని సూచిం చామన్నారు. ఇదే సందర్భంగా స్వాతంత్ర్యదినోత్సవ సన్నాహక సభ నిర్వహించి ఏర్పాట్లను పర్యవేక్షించేలా సూచించారు. నారాయణ గురు జయంతిని తాలూకా కార్యాలయంలో ఆచరించేలా తీర్మానించామన్నారు. అలాగే కృష్ణ జన్మాష్టమి జయంతిని ఘనంగా నిర్వహిం చేందుకు తాలూకా సముదాయ ప్రముఖులు, అధికారులు తీర్మానించారన్నారు. సమావేశంలో తహసీల్దార్ రశ్మి, తాలూకా పంచాయతీ ఈఓ రవికుమార్, నగరాభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు గోపాలరెడ్డి, బీఈఓ సుకన్యా, పురసభ ముఖ్య అధికారి సత్యనారాయణ, సిఐ నంజప్ప, ప్రాథ మిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయగౌడ, హైస్కూల్ టీచర్ల సంఘం అధ్యక్షుడు రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో బాలకార్మిక వ్యవస్థకు చెక్



ప్రత్యేక పోస్టర్ ఆవిష్కరణ

బంగారపేట, జూలై 30: ప్రతి చిన్నారిని పీయూసీ వరకు చదివిస్తే బాలకార్మిక పద్ధతిని పూర్తిగా నిషేధించవచ్చునని చిగురు సంస్థ అధ్యక్షురాలు ప్రభావతి అభిప్రాయపడ్డారు. యువతలో చైతన్యం పెరిగితే దౌర్జన్యం, వేధింపులు వంటివి తగ్గి పోక్సో కేసులు కూడా తగ్గుతాయన్నారు. పట్టణంలోని తాలూకా కార్యాలయ సభాంగణంలో ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి సమక్షంలో 'ప్రతి చిన్నారికి పీయూ వరకు విద్య కల్పించాలనే' నినాదంతోకూడిన చిత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల బాలికలు ఎవరైనా సరే విద్యకు దూరం కారాదన్నారు. సమాజంలో మార్పు ఒక్కరితోనే సాధ్యం కాదని అందరి సహకారంతోనే వీలవుతుందన్నారు. ఎస్ఎస్ఎల్‌సీ ఫెయిల్ అయినవారిని గుర్తించి మళ్లీ పరీక్షలు రాయించేలా చేయడం ద్వారా బాల్య వివాహాలు, బాలకార్మిక పద్ధతిని అడ్డుకోవచ్చునన్నారు. ఇందుకు ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గొర్రెలు స్వాధీనం నిందితుల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

దొడ్డబళ్ళాపుర, జూలై 30: తాలూకాలో వేర్వేరుచోట్ల చోరీకి గురైన గొర్రెల కేసులను రూరల్ పోలీసులు చేధించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేయడంతో వారి నుంచి రూ.2.30 లక్షల విలువైన 18 గొర్రెలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను దర్గాపేట నివాసి నూరుల్లా, రోజిపుర నివాసి మహ్మద్ హబీబ్‌గా గుర్తించారు. ఈనెల 21న సంతోష్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. జిల్లా ఎస్పీ సీకే బాబా, ఏఎస్పీ నాగరాజు, డీఎస్పీ రవిల మార్గదర్శకంలో రూరల్ సీఐ సాదిక్‌పాషా ప్రత్యేకంగా కార్యాచరణ నిర్వహించారు. లింగనహళ్ళికి చెందిన రైతు నాగేశ్ మాట్లాడుతూ ఇదివరకు 8 గొర్రెలు చోరీకి గురయ్యాయన్నారు. చివరకు కేసును చేధించారని హర్షం వ్యక్తం చేశారు.

వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు స్టాపింగ్

గుంతకల్లు, జూలై 30: గుంతకల్లు మీదుగా వెళ్లే కలబురగి-బెంగళూరు- కలబురగి వందేభారత్ (22231/32) ఎక్స్‌ప్రెస్‌కు యాద్గిర్ స్టేషన్‌లో ప్రయోగాత్మకంగా స్టాపింగ్‌ను ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 3 నుంచి ఈ రైలు ఒక నిమిషం ఆగుతుందని పేర్కొన్నారు.

'విద్యార్థులు మొక్కలు నాటాలి'



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

పావగడ, జూలై 30: మొక్కలు నాటడం ప్రతి విద్యార్థి జీవితంలో అలవర్చుకోవాలని సూరప్పనేని విద్యాసాగర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విద్యాసాగర్ సూచించారు. మంగళశారం నాగలమడకలోని చోళరాయచెరువు ప్రాంతంలో గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి ద్వారా మనం ఎన్నోఉపయోగాలు పొందుతున్నామని, అందుకే ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. చిన్నతనం నుంచే మొక్కలు నాటడం, సీడ్ బాల్స్ విసరడం అలవర్చుకోవాలని అటవీశాఖ అధికారి శివప్ప తెలిపారు. ఈ సందర్భంగా గురుకుల విద్యాసంస్థ కార్యదర్శి ఎన్‌సీ నాగభూషణ్, సెమివృక్షసమితి అధ్యక్షులు లోకేష్, పీడీఓ హనుమంతరాయప్ప పాల్గొన్నారు.

వాహనాలు ఢీకొని ఎలుగుబంటి, జింక మృతి

పావగడ, జూలై 30: పట్టణ సమీపంలోని కడుమలకుంట గ్రామంవద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనాలు ఢీకొని ఎలుగుబంటి, జింక మృతి చెందాయి. అటవీశాఖ అధికారి రాకేష్ తెలిపిన వివరాల మేరకు రాత్రి సమయంలో మేత, నీటి కోసం జీవాలు సంచరిస్తున్న సమయంలో భారీ వాహనాలు ఢీ కొని అవి అక్కడికక్కడే మృతి చెందాయన్నారు. పశువైద్యాధికారి రామాంజనేయులతో కలిసి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేశామన్నారు. మృతిచెందిన ఎలుగుబంటి, జింకను అటవీశాఖ కార్యాలయం పక్కన దహనం చేసినట్లు తెలిపారు.